క్లుప్తంగా

అంతరపంటల సాగుతో అదనపు ఆదాయం



మాట్లాడుతున్న ఏఈవో, తదితరులు

చొప్పదండి: ఆయిల్ పామ్ సాగు చేసే రైతులు అంతర పంటల ద్వారా అదనపు ఆదాయం పొందవచ్చని ఏఈవో రమ్యశ్రీ అన్నారు. పట్టణంలో గురువారం లోహియా ఎడిబుల్ ఆయిల్స్ ఆధ్వర్యంలో ఆయిల్ పామ్ సాగు చేసిన రైతులను సన్మానించారు. కోకో, వక్క తదితర పంటల ద్వారా అదనపు ఆదాయం పొందుతూ ఆయిల్‌పామ్ సాగు చేసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో కంపెనీ డిప్యూటీ మేనేజర్ హరీశ్, ఫీల్డ్ ఆఫీసర్ వంశీ, సోమ మల్లారెడ్డి, గుర్రం మల్లారెడ్డి, భూంరెడ్డి, కళ్లెం లక్ష్మారెడ్డి, మరిమడ్ల అంజయ్య, లోక వంశీధర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నిధుల మంజూరుకు మంత్రి హామీ

గంగాధర: మండలంలోని నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు చేయడానికి భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. కరీంనగర్‌లో గురువారం మంత్రిని కలిసి నారాయణపూర్ రిజర్వాయర్ పనులు పూర్తి చేయడానికి రూ.20 కోట్లు, భూ సేకరణకు రూ.23 కోట్లు అవసరమని పనులు పూర్తయితే చొప్పదండితో పాటు వేములవాడ నియోజకవర్గానికి సాగునీటి సమస్య తీరుతుందని తెలియజేయగా రూ.43 కోట్ల నిధుల విడుదలకు మంత్రి హామీ ఇచ్చారని త్వరలోనే పనులు ప్రారంభించి సాగు, తాగునీటి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

నేడు సివిల్ రైట్స్ డే

శంకరపట్నం: మండలంలోని ఏరడపల్లి గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించనున్నామని తహసీల్దార్ సురేఖ తెలిపారు. మండల స్థాయి అధికారులు, అంబేడ్కర్ సంఘం నాయకులు, గ్రామస్తులు పాల్గొనాలని సూచించారు.

రామడుగు: మండలంలోని కోరటపల్లి గ్రామంలో శుక్రవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించనున్నామని తహసీల్దార్ రాజేశ్వరీ ప్రకటనలో తెలిపారు.

వైన్‌షాప్‌లో ఘర్షణ

తిమ్మాపూర్: నుస్తులాపూర్ వైన్‌షాప్‌లో మద్యం ప్రియులు, వైన్ షాప్ సిబ్బంది మధ్య గురువారం రాత్రి గొడవ జరిగింది. మద్యం బాటిళ్లు, బీరు సీసాలతో ఒకరినొకరు కొట్టుకోగా పలువురికి గాయాలయ్యాయి. ఎల్ఎండీ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని విచారణ ప్రారంభించారు. వైన్‌షాప్ నిర్వాహకులు నిబంధనలను పాటించడం లేదని స్థానికులు ఆరోపించారు.

క్షీరాభిషేకం




రామడుగు: మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో గురువారం చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. గ్రామానికి చెందిన పదిమందికి ప్రొసీడింగ్ పత్రాలు అందజేయడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రూ.36 వేలకు వేలం

శంకరపట్నం: మండలంలోని కొత్తగట్టు మత్స్యగిరీంద్రస్వామి ఆలయ సాగు భూమి కౌలుకు గురువారం వేలం నిర్వహించారు. సర్వేనంబర్ 407లో 38 గుంటల భూమిని కౌలుకు సర్వ తిరుపతి రూ.36 వేలకు దక్కించుకున్నాడని ఈవో సుధాకర్ తెలిపారు. కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, అర్చకులు శేషం మురళీధరాచార్యులు, మాధవాచార్యులు పాల్గొన్నారు.

నేడు విగ్రహ ప్రతిష్ఠాపన



ముస్తాబైన ఎల్లమ్మతల్లి ఆలయం

చిగురుమామిడి: మండలంలోని కొండాపూర్ గ్రామంలో గౌడ సంఘం ఆధ్వర్యంలో నూతన ఎల్లమ్మ ఆలయం నిర్మించారు. శుక్రవారం రేణుక ఎల్లమ్మతల్లి విగ్రహ ప్రతిష్ఠాపన, జూన్ 1న పోచమ్మ బోనాలు, 2న జోగు, 3న ఎల్లమ్మ బోనాలు, అదే రోజు ఘటం, 4న ఎల్లమ్మతల్లి కల్యాణం నిర్వహించనున్నామని గౌడ సంఘం అధ్యక్షుడు బుర్ర తిరుపతి, ఉపాధ్యక్షుడు గుడాల సంపత్ తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలన్నారు.

ముగిసిన ధాన్యం కొనుగోళ్లు

- చిగురుమామిడి మండలంలో గతేడాది కంటే అధిక దిగుబడి
- ఐకేపీ, సింగిల్‌విండో ఆధ్వర్యంలో 1,92,705 క్వింటాళ్ల సేకరణ
- రైతుల ఖాతాల్లో నగదు జమ



ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు, (ఇన్‌సెట్‌లో) ధాన్యాన్ని పరిశీలిస్తున్న అధికారులు(ఫైల్)

చిగురుమామిడి: మండలంలోని ఆయా గ్రామాల్లో ఐకేపీ, సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ముగిసింది. ఐకేపీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 14న, సింగిల్‌విండో ఆధ్వర్యంలో అదే నెల 18న కొనుగోళ్లు ప్రారంభమై మే 26వ తేదీతో ముగిశాయి. 42 రోజుల్లో 1261 మంది రైతుల నుంచి ఐకేపీ ఆధ్వర్యంలో 61,270 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. రూ.14.21 కోట్ల విలువ ధాన్యాన్ని మహిళలు కొనుగోలు చేశారు. బొమ్మనపల్లిలో 9,800, గాగిరెడ్డిపల్లి లో 5,041, ఇందుర్తిలో 15,834, కొండాపూర్‌లో 7970, ఓగులాపూర్‌లో 6030, ఉల్లంపల్లిలో 3878 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశామని ఐకేపీ ఏపీఎం ఎం సంపత్ తెలిపారు. గత సీజన్‌తో పోలిస్తే అదనంగా నాలుగు కేంద్రాలను కొత్తగా ఏర్పాటు చేసి 30 వేల క్వింటాళ్లు అధికంగా సేకరించామన్నారు. 95 శాతం రైతుల ఖాతాల్లో నగదు జమ అయిందని పేర్కొన్నారు. చిగురుమామిడి సింగిల్ విండో ఆధ్వర్యంలో ఎనిమిది ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి 38 రోజుల్లో 2,704 మంది రైతుల నుంచి 1,31,435 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు చేశారు. రూ 30.49 కోట్ల విలువ గల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామని సీఈవో కె.నర్సయ్య తెలిపారు. 90 శాతం రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమైందని తెలిపారు. బొమ్మనపల్లిలో 11,643, గునుకులపల్లెలో 14,531, చిన్నముల్కనూర్‌లో 20,821, నవాబుపేటలో 63,689, రామంచలో 25,017, రేకొండలో 19,426, సీతారాంపూర్‌లో 14,053, సుందరగిరిలో 12,252 క్వింటాళ్ల ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేశామన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోండి



కమిషనర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

హుజూరాబాద్: బీసీ ఆజాదీ ఫెడరేషన్ నాయకులు గురువారం మున్సిపల్ కమిషనర్ సమ్మయ్యకు వినతిపత్రం సమర్పించారు. పలు రహదారుల్లో ఇటీవల రోడ్డు ప్రమాదాలు పెరిగాయని, ఎంతోమంది అమాయకులు ప్రాణాలు కోల్పోవడంతోపాటు క్షతగాత్రులుగా మారుతున్నారని, ప్రమాదాల నివారణకు వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు చిలుకమారి శ్రీనివాస్, పద్మశాలీ సంఘం రాష్ట్ర ఆర్గనైజర్, సెక్రెటరీ సంఘం సత్యనారాయణ, ఫెడరేషన్ రాష్ట్ర అధికార ప్రతినిధి సాగర్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లేష్ గౌడ్, కూరపాటి రామచంద్రం, పంజాల వెంకటేశ్వర్లు, నిమ్మల ఇస్మాయినా, నాయీబ్రాహ్మణ సంఘం డైరెక్టర్ నడిగోటి రమేష్ పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి



వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

జమ్మికుంట: అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలని మండలంలోని మడిపల్లి గ్రామానికి చెందిన మహిళలు ఎంపీడీవో కార్యాలయం ఎదుట గురువారం నిరసన తెలిపారు. గ్రామంలో ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఎంపీడీవో భీమేశ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఎంపిడివో భీమేష్ మాట్లాడుతూ అర్హులకు రెండో విడతలో ఇళ్లు కేటాయించేలా చర్యలు చేపడుతామని హామీ ఇచ్చారు.

జమ్మికుంటలో దమ్మ మిషన్ క్యాడర్ క్యాంప్

జమ్మికుంట: పట్టణంలో వినయక గార్డెన్‌లో దమ్మ మిషన్ ఆధ్వర్యంలో భారత రాజ్యాంగం, బుద్ధుడు, అంబేడ్కర్ అనే అంశంపై శుక్రవారం క్యాడర్ క్యాంపు సమావేశం నిర్వహించనున్నామని ఆహ్వానితులు ప్రకటనలో తెలిపారు. సభాధ్యక్షుడిగా మారపల్లి భిక్షపతి, ఉపాన్యాసకులుగా బాలబోయి సుదర్శన్ హాజరవుతారని, కార్యక్రమానికి విద్యావేత్తలు, మేధావులు, యువకులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆహ్వానితులు కొత్తూరి రమేశ్, పబ్బు శ్రీనివాస్, ఎం వెంకటస్వామి, ఇంజపెల్లి రామస్వామి, మైస మహేందర్, సిరిమల్లె రాజు, మారెపెల్లి సదయ్య, కప్పంపెల్లి రవి, గంగారపు మహేష్, గజ్జెల శ్రీధర్, మారెపెల్లి ప్రభు, వడ్లూరి కిషోర్, శనిగరం శ్రావణ్ కోరారు.

ఏసీపీని కలిసిన నాయకులు



శుభాకాంక్షలు తెలుపుతున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్: హుజూరాబాద్ సీపీగా బాధ్యతలు స్వీకరించిన వాసంశెట్టి మాధవిని గురువారం ఆమె కార్యాలయంలో బీజేపీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. మసీద్-కబ్రస్తాన్ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు ముజాహిద్ హుస్సేన్ మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, ప్రభాకర్, రావుల వేణు, యాంసాని శశిధర్, సబ్బని రమేష్, అంకతి వాసు, యల్ల సంజీవరెడ్డి, తిప్పతిని రాజు, గుర్రం సంతోష్, కొలిపాక వెంకటేష్, ఆవుల సదయ్య, పల్లె వీరయ్య, యాట రాజేష్, ఐలయ్య, ఒడ్నాల విజయ్ తదితరులున్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



బహుమతులు ప్రదానం చేస్తున్న ఎస్సై యూనస్

హుజూరాబాద్: క్రీడలతో శారీరక, మానసికోల్లాసం కలుగుతుందని ఎస్‌ఐ ఎస్కే యూనస్ అన్నారు. మండలంలోని పోతిరెడ్డిపేట గ్రామంలో బీసీ సీటిజన్ ఫోరం రాష్ట్ర నాయకులు చందుపట్ల జనార్దన్ తనయుడి స్మారకార్థం నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ గురువారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమానికి ఎస్‌ఐ హాజరై మాట్లాడారు. యువత క్రీడలపై మక్కువ పెంచుకోవాలన్నారు. ఆటలతో ఆరోగ్యం పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చందుపట్ల పరంధాములు, మాజీ ఉప సర్పంచులు చెన్నోజు భద్రయ్య, చందుపట్ల రాజేందర్ తదితరులున్నారు.

డీఈవోకు సన్మానం



పుష్పగుచ్ఛం ఇస్తున్న ప్రతినిధులు

కరీంనగర్: జిల్లా విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టిన శ్రీరాం మొండయ్యను గురువారం ఉపాధ్యాయ ఎమ్మెల్సీ మల్క కొమురయ్య, తపస్ ప్రతినిధులు పుష్పగుచ్ఛం అందజేసి సన్మానించారు. సెక్టోరియల్ అధికారులు అశోక్ రెడ్డి, మిల్కూరి శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి జైపాల్‌రెడ్డి, భగవంతయ్య, అంజిరెడ్డి, తపస్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు, జి రాజేశ్వర్, ఆర్ పవన్ కుమార్, ఎస్. శ్రీధర్, తిరుపతి, బి సత్యం, వి రవీందర్ రెడ్డి, ఎం.సతీశ్ కుమార్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి



మాట్లాడుతున్న రామచంద్రం, తదితరులు

హుజూరాబాద్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పద్మశ్రీ అవార్డు అందుకొని 31న వరంగల్‌కు వస్తున్న నేపథ్యంలో ఎమ్మార్పీఎస్ నాయకులు, అభిమానులు, మేధావులు భారీ సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు రుద్రారపు రామచంద్రం మాదిగ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. 30 ఏళ్ల సుదీర్ఘ పోరాటం ద్వారా కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందన్నారు. సామాజిక పోరాటాలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం అందించటం గర్వనీయమన్నారు. సమావేశంలో నాయకులు తునికి వసంత్, మారెపల్లి శ్రీనివాస్,కలవల మల్లయ్య,మొలుగూరి ప్రభాకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి రొంటాల రాజ్ కుమార్, శనిగరపు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్టు

హుజూరాబాద్: దళిత బంధు సాధన సమితి నాయకులను గురువారం పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. దళిత బంధు సాధన సమితి ఆధ్వర్యంలో ఎలాంటి కార్యక్రమాలు చేపట్టకుండా ఉండేందుకు అదుపులోకి తీసుకున్నారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పోలీసుల అదుపులో ఉన్న వారిలో అకినపల్లి ఆకాష్, శనిగరం రవీందర్, శనిగరం రాజు, శనిగరం సమ్మయ్య, శనిగరం బుచ్చయ్య ఉన్నారు.

వ్యక్తిగత శుభ్రత పాటించాలి



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ సంధ్యారాణి, సిబ్బంది

జమ్మికుంట: పట్టణంలోని మోత్కులగూడెం గ్రామంలో వావిలాల పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అంతర్జాతీయ రుతుస్రావ శుభ్రత దినోత్సవం పురస్కరించుకొని గురువారం అవగాహన కార్యక్రమ నిర్వహించారు. డాక్టర్ సంధ్యారాణి మాట్లాడుతూ మహిళలు, కిషోర బాలికలు రుతుస్రావ సమయంలో పౌష్టికాహారం తీసుకోవాలని, వ్యక్తిగత శుభ్రత పాటించాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్ అరుణ, సరళ, ఏఎన్ఎంలు సైరిత, శైలజ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

మహారాణి అహల్యాబాయి హోల్కర్ జయంతి



నివాళి అర్పిస్తున్న బీజేపీ నాయకులు

హుజూరాబాద్: పట్టణంలోని చేనేత సహకార సంఘం కార్యాలయ ఆవరణలో గురువారం మహారాణి అహల్యాబాయి హోల్కర్ జయంతిని బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. రాణి అహల్యాబాయి హోల్కర్ తన పాలనలో పేదల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు తూర్పాటి రాజు, పారుపల్లి కొండల్ రెడ్డి, గంగిశెట్టి ప్రభాకర్, రావుల వేణు, చిదురాల శ్రీనివాసరెడ్డి, నరాల రాజశేఖర్, తిప్పబత్తిని రాజు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ నిధుల దుర్వినియోగంపై విచారణకు ఆదేశించిన డీపీవో

ఇల్లందకుంట: మండలంలోని సిరిసేడు గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై వచ్చిన ఫిర్యాదు మేరకు సమగ్ర విచారణ జరిపి ఏడురోజుల్లో నివేదిక అందించాలని మండల పంచాయతీ అధికారి రాజేశ్వర్‌రావుకు డీపీవో ఆదేశాలు జారీచేశారు. వివరాలు.. గతంలో విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శి అంకూస్, గ్రామ ప్రత్యేక అధికారిగా ఉన్న ఎంపీవో వెంకటేశ్వర్లు పంచాయతీ నిధుల దుర్వినియోగానికి పాల్పడ్డారని ఆర్టీఐ కార్యకర్త జె.అనిల్ 22న కలెక్టర్ పమేలా సత్పతి, డీపీవోకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. విచారణ అధికారిగా ఉన్న ఎంపీవో రాజేశ్వర్‌రావు సుమారు ఆరు నెలలు పనిచేశారని, ఏ ప్రకారం విచారణ అధికారిగా నియమించారని అనిల్ విమర్శించారు. తనదితానే స్వయం విచారణ చేసుకోవడమేంటని విస్మయం వ్యక్తం చేశారు. విచారణ అధికారిగా ఎంపీవో రాజేశ్వర్‌రావును కాకుండా వేరే అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు.

చాణక్య పొదుపు సంఘం కార్యవర్గం



సదానందం

తిమ్మాపూర్: పొరండ్లకు చెందిన చాణక్య పురుషుల పొదుపు నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎల్లాల సదానందం, ఉపాధ్యక్షుడిగా అంతడుపుల బాలయ్య, పాలకవర్గ సభ్యులుగా అసోధ రాజు, తోడెంగ వేణు, ఎర్రల చందు, మొరపల్లి వెంకట్ రెడ్డి, మొరపల్లి సంపత్ రెడ్డి, గొల్ల లక్ష్మయ్య , పార్నంది వెంకన్న, అసోద కొండయ్య, కందుకూరి విశ్వరూపచారి, మడిశెట్టి సత్యనారాయణ ఎన్నికయ్యారు.

కరపత్రాల ఆవిష్కరణ

హుజూరాబాద్: పట్టణంలోని సీతారామచంద్రస్వామి ఆలయంలో 31న వికాస తరంగిణి ఆధ్వర్యంలో స్వర్ణామృత ప్రాసన గుళికల పంపిణీ కార్యక్రమం నిర్వహించున్నామని ఆలయ ప్రధాన అర్చకులు శ్రీధరాచార్యులు, వికాస తరంగిణి సభ్యులు తెలిపారు. కార్యక్రమానికి సంబంధించిన కరపత్రాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. స్వర్ణామృత ప్రాసన గుళికలు ఆరు నెలల నుంచి 16 సంవత్సరాల పిల్లలకు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆయుర్వేదిక గుళికలతో పిల్లల మానసిక సామర్థ్యాలు, జీర్ణశక్తి మెరుగుపడుతుందని, చర్మం నిగారింపు, జ్ఞాపకశక్తి, రోగనిరోధక శక్తి పెరుగుతుందని, శరీరక్రియలను వేగవంతం చేస్తోందని తెలిపారు. కులమతాలతో సంబంధం లేకుండా గుళికలను తీసుకోవాలన్నారు. కార్యక్రంలో వికాస తరంగిణి సభ్యులు అరుణ్ కుమార్, నిరంజన్ కుమార్, అంజనీదేవి, చిదురాల శ్రీనివాస్, చెరుకుపల్లి శ్రీవాణి, అక్కినపల్లి శ్రవణ్, దాసి కుమారస్వామి, చల్లూరి శ్రీధర్ పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఆలయ ప్రధాన అర్చకులు, వికాస తరంగిణి సభ్యులు



చిగురుమామిడి: మండలంలోని నవాబుపేట ఎస్సీకాలనీలో మురుగు కాల్వలు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. 11వ వార్డులో ఏళ్ల క్రితం నిర్మించిన మురుగుకాలువలు శిథిలావస్థలోకి చేరాయి. పదో వార్డులో మురుగు కాల్వలు లేవు. సీసీరోడ్లు ఉన్నప్పటికీ మురుగునీరు బయటకు వెల్లడం లేదు. వర్షాకాలంలో వరదనీరు, ఇళ్లలోని మురుగునీరు బయటకు వెళ్లలేని పరిస్థితి, దోమలు వృద్ధి చెందడంతోపాటు దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. దోమల బెడదతో రోగాల బారిన పడుతున్నామని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు మురుగు కాల్వలు నిర్మించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సంపత్, పంచాయతీ కార్యదర్శి, నవాబ్‌పేట సెల్ నం : 80996 50001

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

జర్నలిస్టుల ఇళ్ల నిర్మాణాలకు అనుమతించండి



మంత్రికి వినతిపత్రమిస్తున్న జర్నలిస్టు సంఘం నేతలు

కరీంనగర్ అర్బన్: కరీంనగర్‌లో జర్నలిస్టులకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతించాలని తెలంగాణ వర్కింగ్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్(హెచ్143) జిల్లా అధ్యక్షుడు చెరుకు గోపాలకృష్ణ, వర్కింగ్ జర్నలిస్టులు మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌లను కోరారు. కలెక్టరేట్‌లో గురువారం జరిగిన సమీక్షకు మంత్రులు హాజరు కాగా జర్నలిస్టు సంఘాల నేతలు కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. సుదీర్ఘ కాల నిరీక్షణ అనంతరం గత ప్రభుత్వంలో వర్కింగ్ జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చారని, పట్టాలు కూడ ఇవ్వగా మోకాపై నిర్మాణాలు జరుగుతున్న క్రమంలో అధికారులు అడ్డుకున్నారని వివరించారు. చాలీచాలని వేతనాలతో పనిచేసే విలేకరుల పరిస్థితిని అర్థం చేసుకుని నిర్మాణాలకు అనుమతించాలని కోరారు. గతంలో స్థలాలు పొందని అర్హులైన జర్నలిస్టులకు కూడా ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని కోరారు. అతి త్వరలో దీనిని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారు. గోపాలకృష్ణ మాట్లాడుతూ సమాజంలో సత్యాన్ని వెలికితీసే జర్నలిస్టులు తమ కుటుంబాలకు స్థిరమైన గృహం కోసం ఎదురుచూస్తున్నారని అన్నారు. మంత్రులు ఇచ్చిన హామీ క్రమంలో సమస్య పరిష్కారమవుతుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

విద్యావాహిని.. బడిబాట వాణి

- వినూత్న తరహాలో విద్యావాహిని ద్వారా బడిబాట ప్రచారం
- రాష్ట్రస్థాయిలో గుర్తింపు, ఎంఈవోల సదస్సులో ప్రశంసలు
- శ్రీకారం చుట్టిన ఎంఈవో ప్రభాకర్‌రావుకు సత్కారం



బడిబాట కార్యక్రమాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరిస్తున్న ప్రభాకర్ రావు

సప్తగిరికాలనీ(కరీంనగర్): ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా రాష్ట్రంలోనే తొలిసారిగా గంగాధర మండలంలో విద్యావాహిని ద్వారా బడి బాట కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహించి అందరి మన్ననలు పొందిన సంగతి తెలిసిందే. ఏప్రిల్ 25 నుంచి మే 2 వరకు ఒక వాహనానికి విద్యావాహిని అని పేరు పెట్టి ఆ వాహనానికి పాఠశాలలో సమకూరుస్తున్న సౌకర్యాలను, వసతులను చూపే విధంగా ఫ్లెక్సీని రూపొందించి గంగాధర మండలంలో విజయవంతం బడిబాటను చేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు ఆ మండల విద్యాధికారి ఏనుగు ప్రభాకర్ రావు.

రాష్ట్రస్థాయి ఎంఈవోల సదస్సులో

ప్రభుత్వ పాఠశాలలను ఎలా బలోపేతం చేయాలి, నాయకత్వ లక్షణాలు ఎలా పెంపొందించాలి, పాఠశాలల పర్యవేక్షణ ఏ విధంగా చేయాలనే అంశాలపై హైదరాబాద్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రంలో ఈనెల 26నుంచి 28వరకు ఎంఈవోల సదస్సు జరిగింది.

➡ సదస్సులో గంగాధర మండల ఎంఈవో ప్రభాకర్‌రావు ప్రభుత్వ పాఠశాలల్లో మంచి తరగతి గదులు, సైన్స్‌ల్యాబ్‌లు, లైబ్రరీలు, ఆత్మరక్షణకు కరాటే శిక్షణ, ఆరోగ్యానికి పౌష్టికాహారం.. ఇలా అన్ని రకాల వసతులున్నాయి మీ పిల్లలను మా బడిలో చేర్పించండి అంటూ వినూత్న తరహాలో విద్యావాహిని ద్వారా బడిబాట ప్రచారం ఏవిధంగా చేశారో పవర్ ప్రజెంటేషన్ ద్వారా చూపించారు.

➡ ప్రభాకర్ రావు ప్రదర్శించిన వీడియోను రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని మండల విద్యాధికారులు పరిశీలించారు.

➡ రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు డిజిటల్ మీడియా వినియోగాన్ని అభినందిస్తూ, విద్యపై అవగాహన కలిగించడంలో ఇది ఒక ఉత్తమ ఉపాయంగా కొనియాడుతూ ప్రభాకర్‌రావును సత్కరించారు.

33 గ్రామాల్లో..

పాఠశాలల్లో విద్యార్థుల చేరికను పెంచే దిశగా ఒక వినూత్న తరహా ప్రచారానికి తెరదించి మిగతా వారికి స్ఫూర్తిగా నిలిచారు. ప్రభుత్వం ఏటా నిర్వహించే బడి బాటకు ముందు తనే స్వతహాగా విద్యావాహిని పేరిట ఒక వాహనాన్ని తయారు చేశారు. ఆ వాహనానికి బడిలో కల్పిస్తున్న వసతులకు సంబంధించిన ఫొటోలతో ప్రచారం చేస్తూ తల్లిదండ్రులకు అవగాహన కల్పిస్తూ అందరి ఆకర్శించారు. పాఠశాలలో పాఠాలు బోధించే ఉపాధ్యాయులను వెంటేసుకుని రోజుకో గ్రామం తిరుగుతూ బడి బాటను కొనసాగించారు. గ్రామాల్లో సమావేశాన్ని ఏర్పాటు చేసి ప్రభుత్వ బడులపై తల్లిదండ్రులకు, ఇతరులకు అవగాహన కల్పించారు. గంగాధర మండలంలోని 33 గ్రామాల్లోని 44 పాఠశాలలో విద్యార్థులను సంఖ్యను పెంచే లక్ష్యంగా ప్రచారం చేశారు.

ఉన్నతాధికారుల స్ఫూర్తితో..



కలెక్టర్ పమేలా సత్పతి ప్రభుత్వ పాఠశాలల అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్న తీరు. విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా బడిబాట జూన్‌లో ఎందుకు ఏప్రిల్‌లో చేయండి అని సలహా ఇవ్వడం.. వారి స్ఫూర్తితో స్వతహాగా విద్యావాహిని పేరిట కార్యక్రమం రూపొందించా. గంగాధర మండలం ఇప్పుడు ఒక మోడల్‌గా తయారైంది. ఆనందంగా ఉంది. మండలంలోని ఉపాధ్యాయులు, గ్రామ నాయకులు, ఏఏపీసీ సభ్యులు, తల్లిదండ్రులందరూ విజయవంతానికి కృషి చేశారు.

– ప్రభాకర్ రావు, ఎంఈవో, గంగాధర